సాక్షి నంద్యాల

బుధవారం : 27 : సెప్టెంబర్ : 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



7,220 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి మంగళవారం 7,220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా దిగువకు 4,446 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వర్ష సూచన

ఎమ్మిగనూరు రూరల్: జిల్లాలో నేటి నుంచి అక్టోబర్ 1 వరకు ఓ మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహదేవయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పోలీసులకు వివరించారు. మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నిర్వాహణ, సిబ్బంది పనితీరును సీఐ ప్రభాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నామన్నారు. ముఖ్యమైన కేసుల వివరాలు, కేసు ఫైల్, డ్యూటీ రోస్టర్, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. తప్పు చేసిన నిందితులకు తప్పకుండా శిక్షలు పడేలా సాక్ష్యాలు సేకరించాలని వివరించారు. ప్రతి రోజు సాయంత్రం ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేలా విజిబుల్ పోలీసింగ్‌ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

నేడు బనగానపల్లెలో 'జగనన్నకు చెబుదాం'

నంద్యాల: ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని ఈనెల 27న బనగానపల్లెలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కందులు క్వింటా రూ.10,600

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ, కందులు, ఉల్లి తదితర పంటలకు అత్యుత్తమ ధర లభిస్తుండటం రైతులకు ఉపశమనం కలిగిస్తోంది. కందుల ధర క్వింటాకు రూ.10,600 లభించడం విశేషం. వేరుశనగ పంటకు కనిష్ఠంగా రూ.3,006, గరిష్ఠంగా రూ.8,371, మోడల్ రూ.6,169 లభించింది. ఆముదం పంటకు కూడా ధర ఆశాజనకంగానే ఉంది. కనిష్ఠ ధర రూ.5,779, గరిష్ఠ ధర రూ.5,779, మోడల్ ధర రూ.5,372లుగా నమోదైంది. ఉల్లికి కనిష్ఠ ధర రూ.2251, గరిష్ఠ ధర రూ.2381, మోడల్ ధర రూ.2279 లభించింది. పొద్దుతిరుగుడు పంటకు కనిష్ఠంగా రూ.3,769, గరిష్ఠ ధర రూ.4809, మోడల్ ధర రూ.4,239 వచ్చింది. అన్ని పంటలను ఈ–నామ్‌లోనే కొనుగోలు చేస్తుండటం విశేషం.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్‌గా ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



కర్నూలు (రాజ్‌విహార్): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ. హఫీజ్ ఖాన్ మరోసారి నియమితులయ్యారు. ఎమ్మెల్యే కేటగిరీలో ఆయనను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–2025 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న 9వ తరగతి సీట్ల భర్తీ చేయనున్నట్లు విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో అక్టోబర్ 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక పరీక్ష 10–02–2024లో ఉంటుందన్నారు. విద్యార్థులు https://navodaya.gov.in, www.nvsadmissionclassnine.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శ్రీమఠం ఆదాయం రూ. 3.82 కోట్లు

మంత్రాలయం: ప్రముఖ రాఘవేంద్ర స్వామి మఠానికి సంబంధించి 34 రోజుల హుండీ కానుకల లెక్కింపు మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు రాఘవేంద్రుల ప్రధాన హుండీ, మాంచాలమ్మ ఆలయ హుండీలను లెక్కించగా రూ. 3,82,59,839 ఆదాయం వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. నగదు రూ.3.74 కోట్లు రాగా అందులో రూ.7,73,980 నాణేలు వచ్చాయి.

బతుకు బండికి భరోసా

ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర ఆర్థిక సహాయం

- ఈనెల 29న నిధులు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్కో డ్రైవర్‌కు రూ.10 వేలు మంజూరు
- జిల్లాలో 9,521 మందికి రూ.9.52 కోట్ల లబ్ధి
- ఈ ఏడాది కొత్తగా 1,296 మంది లబ్ధిదారుల ఎంపిక
- 351 మంది ఎండీయూ ఆపరేటర్లకు సైతం పథకం వర్తింపు

నంద్యాల: పేదల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఏటా క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారు. అన్ని రంగాలను బలోపేతం చేస్తూ అండగా నిలుస్తున్నారు. కష్టజీవులకు నేనున్నానంటూ ఆదుకుంటున్నారు. వరుసగా ఐదో ఏడాది 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం కింద ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఈనెల 29వ తేదీ జమ చేయనున్నారు. కాకినాడలో నిర్వహించే బహిరంగ సభలో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ నిధులు ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లు నడుపుతూ జీవిస్తున్న డ్రైవర్లకు, వాహనాల నిర్వహణ ఖర్చులు, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇతర ఖర్చుల కోసం డ్రైవర్లకు ఎంతో ఉపయోగపడనున్నాయి. నంద్యాల జిల్లాలో 9,521 మంది వాహన మిత్ర లబ్ధిదారుల ఖాతాల్లో రూ.9.52 కోట్లు జమ కానున్నాయి. కాగా జిల్లాలో ఇప్పటికే 8,225 మంది వాహన మిత్ర లబ్ధిదారులతో పాటు కొత్తగా ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్ కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్న డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు 1,296 మంది మొత్తం 9,521 మందికి ఈ ఏడాది వాహనమిత్ర నిధులు జమ కానున్నాయి. నంద్యాల కలెక్టరేట్‌లో వాహనమిత్ర లబ్ధిదారులతో సమావేశం నిర్వహించనున్నారు.



సీఎం చేస్తున్న సాయాన్ని మరువలేను

నేను 16ఏళ్లుగా జీవనోపాధి కోసం పట్టణంలో ఆటో నడుపుతున్నా. అరకొర సంపాదనతో కుటుంబం గడవటం కష్టంగా ఉండేది. ఆటోకు మరమ్మతులు చేయించాలంటే ఆర్థిక ఇబ్బందులతో జాప్యమయ్యేది. ఎలాగోలా నెట్టుకొస్తున్న తరుణంలో జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టాక వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.10 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఆ డబ్బుతో ఆటో మరమ్మతులతో పాటు కొంత కుటుంబ పోషణకు ఉపయోగపడుతుంది. సీఎం చేసిన ఈ సాయాన్ని జీవితంలో మరిచిపోలేను. ఐదో సారి వాహన మిత్ర కింద నా ఖాతాలో డబ్బులు జమ కానున్నాయి.

– మిడుతూరి రాజు, వీసీ కాలనీ, నంద్యాల

ఎండీయూ ఆపరేటర్లకు సైతం వాహన మిత్ర

రేషన్ బియ్యంతో పాటు ప్రజల నిత్యావసర సరుకులు ఇంటింటికి అందజేస్తున్న ఎండీయూ వాహన దారులకు సైతం ఈ ఏడాది వాహనమిత్ర పథకాన్ని వర్తింపజేశారు. జిల్లాలోని 351 మంది ఎండీయూ వాహన దారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు వాహనమిత్ర పథకం కింద జమ కానున్నాయి.

29న పట్టణంలో వాహనాల ర్యాలీ..

వైఎస్సార్ వాహన మిత్ర నిధులు జమకానున్న సందర్భంగా ఈనెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఉప రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ అనంతరం వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో లబ్ధిదారులకు వాహనమిత్ర పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.



జిల్లాలో వాహనమిత్ర లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూపాయల్లో)
నంద్యాల	1,994	1,99,40,000
ఆళ్లగడ్డ	1,258	1,25,80,000
బనగానపల్లె	1,139	1,13,90,000
శ్రీశైలం	1,533	1,53,30,000
పాణ్యం	596	59,60,000
నందికొట్కూరు	1,697	1,69,70,000
డోన్	1,304	1,30,40,000
మొత్తం	9,521	9,52,10,000

ఎంతో ఉపయోగకరం



ప్రభుత్వం అందజేసిన ఎండీయూ వాహనం ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు ఇంటింటికి రెండేళ్లుగా అందజేస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేషన్ వాహనాలను 90 శాతం సబ్సిడీతో అందజేశారు. అంతేకాకుండా నెలకు జీవనోపాధి కింద రూ.18 వేలు వేతనం ఇస్తున్నారు. ఈ క్రమంలో వాహనమిత్ర పథకం కింద ఈ ఏడాది ఎండీయూలకు కూడా అవకాశం కల్పించడం సంతోషకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహన దారులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– ఖాజా శ్రీనివాసులు, ఎండీయూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల

కొత్తగా 1,296 మందికి మంజూరు



గత సంవత్సరం వాహనమిత్ర పథకం కింద 8,225 మందికి నగదు నేరుగా ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేసింది. ఈ ఏడాది 1,296 మంది కొత్తవారితో కలిపి మొత్తం 9,521 మంది ఈ పథకం కింద ఎంపికయ్యారు. ఈ ఏడాది కొత్తగా ఎండీయూ వాహన దారులకు సైతం వాహన మిత్ర కింద రూ.10 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. వీరందరికీ శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా నంద్యాల జిల్లాకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.9.52 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పథకం డ్రైవర్లకు చాలా ఉపయోగకరం.

–జి.శివారెడ్డి, ఆర్‌టీఓ, నంద్యాల

శ్రీశైలానికి వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి 24,898 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. జూరాలలో విద్యుత్ ఉత్పాదన చేస్తూ 20,452 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 4,446 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి మంగళవారం వరకు దిగువ ప్రాంతాలకు 6,437 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భజల విద్యుత్ కేంద్రంలో 0.251 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 458 క్యూసెక్కుల నీటిని వదిలారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2000, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,503 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మంగళవారం సాయంత్రానికి శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 90.3480 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటి మట్టం 854.40 అడుగులకు చేరుకుంది.

శ్రీమఠంలో సినీనటుడు



మాంచాలమ్మ సన్నిధిలో సినీనటుడు లారెన్స్

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రుడి దర్శనార్థమై సినీ నటుడు, డాన్స్ మాస్టర్ రాఘవ లారెన్స్ మంగళవారం మంత్రాలయానికి వచ్చారు. ముందుగా ఆయన గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకుని తర్వాత రాఘవేంద్రుల మూల బృందావనంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు భక్తులు, అభిమానులు ఎగబడ్డారు.

శనగ విత్తనాల కేటాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): ముందస్తు రబీ కోసం జిల్లా యంత్రాంగం మండలాల వారీగా శనగ విత్తనాలను కేటాయించింది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం మొదలైంది. ఆర్‌బీకేల వారీగా శనగ విత్తనాలు పొజిషన్ చేసే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తనాల్లో 98 శాతం స్వచ్ఛత ఉండటం విశేషం.

లక్ష్యానికి చేరువలో..!



ప్యాపిలి మండలం మాధవరంలో ఈ - క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

- జిల్లాలో 95 శాతం ఈ క్రాప్ నమోదు
- ఈనెల 15వ తేదీకే ముగిసిన గడువు
- రైతుల సంక్షేమం దృష్ట్యా 30 వరకు పొడిగించిన ప్రభుత్వం

సాక్షి, నంద్యాల: ఆరుగాలం శ్రమించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. వ్యవసాయంలో రైతులు నష్టపోకుండా పంట విత్తు మొదలు, దిగుబడి విక్రయాల వరకు ఆదుకుంటోంది. రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల వర్తింపు, రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతింటే నష్టపరిహారం పొందడానికి, మార్కెట్‌లో ధరలు పడిపోయినప్పుడు ఆదుకునేందుకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా మారింది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతును పంట పొలంలో నిల్చోబెట్టి ఫొటో తీసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధిచి ఆగస్టు 15వ తేదీన ఈ క్రాప్ నమోదును ప్రారంభించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే ఈ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల వివరాల నమోదు కొంత జాప్యం ఏర్పడింది. సకాలంలో వర్షాలు కురకపోవడం, వరి నాట్లు నెమ్మదిగా సాగడమే ఇందుకు కారణం. పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఈ – క్రాప్ నమోదు 95 శాతం పూర్తి కాగా ఈనెలాఖరులోపు వంద శాతం పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకునేందుకు వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు.

రాష్ట్రస్థాయిలో ఏడో స్థానం..

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,88,181 ఎకరాలు. అయితే ఇప్పటి వరకు 4,887,981 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో ఉద్యాన పంటలు 80,435 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న, శనగ, చిరుధాన్యాలతో పాటు ఉద్యాన పంటల సాగు ఆలస్యం కావడంతో ఈ - క్రాప్ నమోదు నెమ్మదించింది. ఈనెల 26వ తేదీ నాటికి 4,48,798 ఎకరాల్లో ఈ - క్రాప్ నమోదు పూర్తయ్యింది. ఈ క్రాప్ నమోదులో రాష్ట్రస్థాయిలో జిల్లా ఏడో స్థానంలో ఉంది. గడువులోగా లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సాగు వివరాలు ఇలా...

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం	5,88,181 ఎకరాలు
ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం	4,87,981 ఎకరాలు
ఈ క్రాప్ పూర్తయినది	4,61,387 ఎకరాలు
పూర్తయిన శాతం	94.55

పక్కాగా హద్దులు నిర్ధారించి...

నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) సౌజన్యంతో ప్రత్యేకంగా డిజైన్ చేసిన యాప్‌లో ఆధార్, వన్‌బీ, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్, సీసీఆర్సీ కార్డు వివరాలను నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత జియో ఫెన్సింగ్ ద్వారా సరిహద్దులు నిర్ధారించి, రైతు ఫొటోను ఆర్బీకే సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ– క్రాప్‌తో పాటు ఈ -కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ప్రతి రైతుకు రసీదులు అందజేస్తున్నారు. అయితే ఈ– క్రాప్ నమోదుతో పోలిస్తే ఈ -కేవైసీ నత్తనడకన సాగుతోంది. సాంకేతిక సమస్యల వల్ల రైతుల వేలిముద్రలు పడడం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 34 శాతమే ఈ– కేవైసీ పూర్తయింది.

వంద శాతం పూర్తి చేస్తాం

జిల్లాలో సాగైన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 95 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయింది. 30వ తేదీ వరకు గడువు ఉంది. ఈ లోగా వంద శాతం చేసేలా చర్యలు చేపడుతున్నాం. కొన్ని సాంకేతిక కారణాల రీత్యా ఈ– కేవైసీ ఆలస్యమవుతోంది. ఇప్పటి వరకు 1,38,898 ఎకరాలు (34 శాతం) మాత్రమే ఈ– కేవైసీ పూర్తయింది. సమస్యలను అధిగమించి ఏ ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

వైద్య శిబిరాలను విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



కంటి పరీక్షల క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు సూచించారు. చాబోలు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి జిల్లాలోని సచివాలయాల పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈనెల 15 నుంచి వలంటీర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేసి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా టోకెన్ నంబర్లు ఇస్తున్నారన్నారు. రోగులకు ఎవరికైనా పెద్ద చికిత్సలు అవసరమైతే ప్రభుత్వ సర్వజన వైద్యశాల, నెట్‌వర్క్, ఏరియా ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో 30 రోజు ల పాటు నిర్వహించే జగనన్న సురక్ష క్యాంపులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొనేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌తో పాటు, పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్సల కిట్లు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు తదితరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రయోగాత్మక నిర్వహించిన వైద్య శిబిరంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకుని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ నెల 30 నుండి సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి రామనాథం, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జఫ్రుల్లా, ఎంపీడీఓ సుగుణశ్రీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'శోభా'యమానం



వినాయక ఘాట్‌లో అశేషజనవాహిని మధ్య గణేష్ నిమజ్జనోత్సవ దృశ్యం

- గంగ ఒడికి పార్వతీ తనయుడు
- కర్నూలులో కనుల పండువగా గణేష్ నిమజ్జనోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కర్నూలు కల్చరల్: ''గణపతి బప్ప మోరియా.. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై..'' అంటూ అశేష భక్తజనం నినదించగా మహా గణపతి నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగింది. కర్నూలు నగరంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న పార్వతీ తనయుడు మంగళవారం భక్తుల జయ జయ ధ్వానాలు.. చిన్నారుల కేరింతలు.. మంగళ వాయిద్యాల మధ్య గంగమ్మ ఒడి చేరాడు. శివాజీ మహరాజ్ 350వ పట్టాభిషేక మహోత్సవం, వీహెచ్‌పీ షష్ఠ్యబ్ది వేడుకలు, చంద్రయాన్–3 విజయవంతం నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలకు ఈ ఉత్సవాలను అంకితం చేశారు. రాంబొట్ల ఆలయం వద్ద స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి తొలి పూజ నిర్వహించి శోభాయత్ర ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎంపీ బుట్టారేణుక, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా సమన్వకర్త ఎం.నాగఫణి శాస్త్రి, కర్నూలు, నంద్యాల జిల్లాల బీజేపీ అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, బైరెడ్డి శబరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏపీలో ఎక్కడా లేనివిధంగా నగరం నడి మధ్యలో కేసీ కాల్వలో విఘ్నేశ్వరునికి ఘనంగా వీడ్కోలు పలికారు. కేసీ కెనాల్‌కు ఇరువైపుల ఎనిమిది ఘాట్‌లలో ఆరు, క్రేన్‌లు.. స్టాంటన్ పురం మమతా నగర్ వద్ద ఘాట్‌లో ఒక క్రేన్‌తో నిమజ్జనం చేపట్టారు. సుమారు 2,200 విగ్రహాలు రెండు వేల మంది పోలీసుల బందోబస్తు, వందలాది మంది స్వచ్ఛంద సేవకులతో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. శోభాయాత్రలో పరిపాలనా గణపతి వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోలాటం ఆడుతూ నృత్యం చేశారు.



నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



ఘాట్ వద్ద విద్యార్థినుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

దేవస్థాన విభాగాలను పరిశీలించిన ఈఓ పెద్దిరాజు



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలోని పలు విభాగాలను ఈఓ డి.పెద్దిరాజు మంగళవారం పరిశీలించారు. శ్రీశైలం టీవీ, అన్నప్రసాద వితరణ, కమాండ్ కంట్రోల్‌రూం, ప్రసాదాల విక్రయ కేంద్రాలను సందర్శించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. అందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలని శ్రీశైలప్రభ సంపాదకులను ఆదేశించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కేంద్రంలోని, భోజనశాల, పాకశాల, కూరగాయలు నిల్వచేసే కోల్డ్‌స్టోరేజ్ తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, సహాయ కార్యనిర్వాహణాధికారి ఐఎస్‌వీ మోహన్, పర్యవేక్షకులు సి.మధుసూధన్ రెడ్డి ఉన్నారు.

యువకుడి బలవన్మరణం



ప్రభాకర్(ఫైల్)

మహానంది: ఫైనాన్స్ వ్యాపారులు ఒత్తిళ్లు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందిపల్లె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నంది పల్లెకు చెందిన ప్రభాకర్ (23) తన సమీప బంధువు సోమయాజులపల్లెకు చెందిన శేఖర్ ఓ ప్రైవేటు సంస్థలో తీసుకున్న రుణానికి పూచీ పడ్డాడు. అయితే, మూడు కంతుల్లో రూ.70వేలు చెల్లించాల్సి ఉండగా శేఖర్ స్పందించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు ప్రభాకర్‌పై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం కోలుకోలేక మృతి చెందాడు. మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన నర్సమ్మతో ప్రభాకర్‌కు ఇటీవల వివాహమైంది. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోక సంద్రంలో మునిగారు.మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులు కొని మోసపోవద్దు

కర్నూలు(రాజ్‌విహార్): వక్ఫ్‌బోర్డు ఆస్తులు కొనుగోలు చేసి మోసపోవద్దని ఏపీ స్టేట్ వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు సయ్యద్ మహమూద్ పీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కర్నూలులో వక్ఫ్ స్థలాలు సెంటు రూ. 20 వేల నుంచి రూ.40 వేల వరకు అమ్ముతున్నట్లు జరుగుతున్న ప్రచారంతో అనేక మంది కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇవి రిజిస్ట్రేషన్ కావన్నారు.

పర్యాటకం శోభించేలా..

- ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఆరు పర్యాటక ఎక్సలెన్స్ అవార్డులు
- ఉత్తమ పర్యాటక, సాంస్కృతిక అధికారిగా పి.విజయ ఎంపిక
- హరిత హోటల్స్ రాష్ట్ర ఉత్తమ మేనేజర్‌గా పవన్‌కుమార్
- నేడు విజయవాడలో అవార్డు అందుకోనున్న అధికారులు



కర్నూలు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారిణి పి.విజయ

కర్నూలు కల్చరల్/ నంద్యాల(సెంట్రల్): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రదానం చేస్తున్న టూరిజం ఎక్సలెన్స్ అవార్డుల్లో జిల్లాకు స్థానం దక్కింది. బెస్ట్ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు విభాగంలో కర్నూలు ఎయిర్ పోర్టు టూరిజం ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకుంది. దీంతో పాటు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారిణి పి.విజయ ఉత్తమ పర్యాటక, సాంస్కృతిక అధికారిగా అవార్డుకు ఎంపికయ్యారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారిణి పి.విజయ బుధవారం విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో అవార్డులను అందుకోనున్నారు.

పర్యాటక దినోత్సవ వేడుకలు వాయిదా


కర్నూలు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించాల్సిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి పి.విజయ తెలిపారు. వేడుకలను ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ డి.సృజన, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు.




కర్నూలు ఎయిర్ పోర్టు



పాండురంగాపురం ఏరియల్ వ్యూ



బెలుంగుహలు



అహోబిలం దేవస్థానం

నంద్యాల జిల్లాకు నాలుగు అవార్డులు

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో నంద్యాల జిల్లాకు నాలుగు విభాగాల్లో స్టేట్ ఎక్సలెన్సీ అవార్డులు దక్కినట్లు జిల్లా పర్యాటక-సాంస్కృతిక అధికారి సీ.హెచ్.ఎస్.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హరిత టూరిజం హోటల్స్‌లో నుంచి ఉత్తమ మేనేజర్ కేటగిరీలో శ్రీశైలం హరిత హోటల్ నిర్వహణాధికారి పవన్‌కుమార్‌కు అవార్డు వరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు ఉత్తమ గ్రామీణ పర్యాటక గ్రామంగా అహోబిలం, ఉత్తమ సివిక్ మేనేజ్‌మెంట్ గ్రామంగా పాండురంగాపురం, ఉత్తమ ఫ్రెండ్లీ ఆర్కియాలజికల్ మాన్యుమెంట్‌గా బెలుం గుహలు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తమ గ్రామీణ పర్యాటక గ్రామం అవార్డును అహోబిలం దేవస్థానం కమ్యూనికేషన్స్ అధికారి సేతురామన్, ఉత్తమ ఫ్రెండ్లీ ఆర్కియలాజికల్ మాన్యుమెంట్ అవార్డును పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు రజిత, ఉత్తమ సివిక్ మేనేజ్‌మెంట్ అవార్డును పాండురంగాపురం సర్పంచ్ యర్రబోలు దోలావతమ్మ అందుకోనున్నట్లు తెలిపారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ఉన్నతాధికారుల చేతుల మీదుగా సత్కారం పొందనున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకానికి జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఇస్తున్న ప్రాధాన్యతతోనే ఈ అవార్డులు సాధ్యమైనట్లు ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా టూరిజం శాఖ తరఫున పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.



శ్రీశైలం హరిత హోటల్ మేనేజర్ పవన్ కుమార్

9 మండలాల్లో మోస్తరు వర్షం

- ఆలూరులో అత్యధికంగా 39.4 మి.మీ వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
ఆలూరు	39.4
హాలహర్వి	38.8
పత్తికొండ	30.2
చిప్పగిరి	28.6
మద్దికెర	24.2
హొళగుంద	19.4



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. సోమవారం రాత్రి 11 గంటల నుంచి మంగళవారం ఉదయం వరకు 9 మండలాల్లో వర్షాలు కురిశాయి. రబీలో శనగ ఎక్కువగా సాగు చేసే ఆలూరు సబ్ డివిజన్‌లోనే ఆశాజనకంగా వర్షాలు పడుతుండటం విశేషం. ఇటీవల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మళ్లీ మూడు, నాలుగు రోజులుగా వివిధ మండలాల్లో వర్షాలు పడుతుండటం రబీకి కలసి వచ్చే అవకాశం. జిల్లా మొత్తంగా సగటున 7.6 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 93.7 మి.మీ వర్షం కురిసింది.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల వివాదం

- ఏ పని చేయాలో తెలియని పరిస్థితి
- కంటి ఆసుపత్రిలో ఇద్దరు వైద్యుల సరెండర్

కర్నూలు(హాస్పిటల్): ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల వల్ల వివాదం నడుస్తోంది. సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్‌లో ఉన్న వైద్యులు చాలా మంది కంటి ఆసుపత్రిలో ఈ పోస్టులు ఉన్నాయని తెలిసి అక్కడ పోస్టింగ్ వేయించుకుంటున్నారు. తీరా అక్కడికి వచ్చాక ఏ పని చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్ వారితో కంటి ఆసుపత్రిలో ఏ పని చేయించాలని అక్కడి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఎప్పుడో ఆసుపత్రి ఏర్పాటైనప్పుడు ఐదు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మంజూరయ్యాయి. అప్పట్లో కంటి వైద్యులు తక్కువగా ఉండటంతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులతో వైద్యసేవలు అందించేవారు. కానీ ఇప్పుడు ఆసుపత్రిలో నాలుగు యూనిట్లలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 16 మంది దాకా ఉన్నారు. వీరితో పాటు పీజీ వైద్యులు వైద్యవిద్యను అభ్యసించడంతో పాటు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఐదుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు ఎలాంటి పని అప్పగించాలో తెలియక అధికారులు నిమ్మకుంటున్నారు. దీంతో కొందరిని జిల్లా అంధత్వ నివారణ అధికారిగా, ఒకరిని ఆర్‌ఎంఓగా, మరికొందరిని ఇతర పనులకు పురమాయిస్తున్నారు. మరో ఇద్దరు ఖాళీగా ఉండటంతో వారిని ఇటీవల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అయితే తాము కంటి ఆసుపత్రిలో చేరి అక్కడెలా పనిచేస్తామని వారు చెప్పడంతో తమ మాట వినలేదని వారిద్దరినీ డీహెచ్‌కు సరెండర్ చేశారు. కాగా వాస్తవంగా గతంలో ఇక్కడ ఆర్‌ఎంఓ, జిల్లా అంధత్వ నివారణ అధికారి విధులను సైతం కంటి వైద్యులే నిర్వహించేవారు. కానీ ఇప్పుడు ఆ విధులను సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లతో నిర్వహిస్తున్నారు. అయితే ఆసుపత్రిలో ఉన్న ఐదు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులలో వైద్యులు పోస్టింగ్ తెచ్చుకుని పనిలేక ఖాళీగా ఉంటున్నారని, ఈ మేరకు వారికి జీతాలు కూడా కూర్చోబెట్టి ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల్లో నియమితులైన వైద్యులకు ఏ పనీ లేదని, ఈ మేరకు ఆ పోస్టులను సరెండర్ చేసేలా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.



ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి

టపాసుల విక్రేతలకు జరిమానా

కోవెలకుంట్ల: ఎలాంటి లైసెన్స్ లేకుండా టపాసుల విక్రయించిన వ్యక్తులకు మంగళవారం న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన సూర్యనారాయణ 2019వ సంవత్సరంలో పట్టణంలో లైసెన్స్ లేకుండా టపాసుల విక్రయాలు జరిపారు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో కేసు నిర్ధారణ కావడంతో ఒక్కొక్కరికి రూ. 4 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ తీర్పు ఇచ్చారన్నారు.

నలుగురు శ్రీశైలం గురుకుల విద్యార్థుల అదృశ్యం

- గుంటూరులో ఉన్నట్లు సమాచారం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అదృశ్యం అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కావేటి నాగశేషాద్రి, రమావత్ నాగరాజు నాయక్, ఎరుకల విజయ్, బద్దేటి రాంచరణ్ ఈనెల 21వ తేదీ తెల్లవారు జాము నుంచి హాస్టల్ గది నుంచి ఎవరి అనుమతి లేకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ విషయమై అక్కడి సిబ్బంది ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యార్థుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తూ వారి తల్లితండ్రులకు సమాచారం అందించారు. అయితే నలుగురు సోమవారం వరకు హైదరాబాద్‌లో ఉండి మంగళవారం గుంటూరుకు చేరినట్లు తెలిసింది. ఈ విషయమై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆరా తీయగా నలుగురు విద్యార్థులు చెడు అలవాట్లకు గురై పాఠశాలలో సక్రమంగా మెలగడం లేదనే విషయంపై గతంలో సదరు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ సమాచారం ఇచ్చి బదిలీ సర్టిఫికెట్లు ఇస్తామని హెచ్చరించారు. అయితే ఆ విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లల భవిష్యత్ దృష్ట్యా పదో తరగతి పూర్తయ్యే అవరకు ఇక్కడే ఉండేలా చూడాలని కోరడంతో సంజాయిషీ పత్రం తీసుకున్నట్లు తెలిసింది. కాగా పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల అదృశ్యమైన సంఘటనపై ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రెడ్డప్పకు ఐటీడీఏ పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి మంగళవారం మెమో జారీ చేశారు. విద్యార్థులను గుంటూరు నుంచి తీసుకురావడానికి ఆ పాఠశాలలో పని చేస్తున్న సిబ్బంది వెళ్లినట్లు పీఓ తెలిపారు.



గురుకుల పాఠశాల

అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అనుమతులు లేకుండా మట్టి తవ్వితే చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 550డి లో మైనింగ్ శాఖ అనుమతి లేకుండా విండ్‌పవర్ (గాలిమర)కు సంబంధించిన కంపెనీ యజమానులు మట్టి తవ్వి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆ శాఖ అధికారులు మంగళవారం ఆ పొలానికెళ్లి పరిశీలించారు. దాదాపు 5వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వి తరలించినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై విచారణ చేయగా గాలిమరల ఏర్పాటు, రోడ్డు పనులకు మట్టి తీసుకెళ్లడానికి సదరు సర్వేనంబర్ పొలం యజమాని సలీమ్ నుంచి తాము అనుమతి తీసుకున్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో అతడికి వెంటనే నోటీసు జారీ చేశారు. అనంతరం డీడీ మాట్లాడుతూ వ్యవసాయభూముల్లో జిల్లా మైనింగ్ శాఖ అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టరాదని అన్నారు. తనిఖీలో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

నేడు పారామెడికల్ కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సులకు ఆఖరి కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10 గంటలకు కళాశాలలోని న్యూ ఆడిటోరియంలో హాజరుకావాలన్నారు.

శ్రీనగరంలో పాము కలకలం

మహానంది: రోజూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పాముల సంచారం అధికమైంది. మండలంలోని శ్రీనగరం గ్రామంలో మంగళవారం నవీన్ ఇంట్లో రక్తపింజర పాము కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే వారు అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించడంతో అతను వచ్చి పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.



పామును పట్టుకున్న మోహన్

ప్రభుత్వ నిర్ణయంపై బుడగజంగాల హర్షం

కర్నూలు(అర్బన్): బుడగ జంగాల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపడంపై బుడగ జంగాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వం కోరిన ఫార్మెట్‌లో తమ సమస్యలపై అసెంబ్లీ, కేబినెట్‌లోనూ తీర్మానం చేసి పంపడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. బుడగ జంగాలు ఎదుర్కొంటున్న రిజర్వేషన్ సమస్యపై గత 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తూనే ఉన్నామని, పాలకులు చేద్దాం, చూద్దాం అనే రీతిలోనే వ్యవహరిస్తూ వచ్చారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే తమకు న్యాయం చేశారన్నారు. ఈ నేపథ్యంలో సీఎంకు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎస్సీ కమిషన్ చైర్మన్, ఇతర ఉన్నత స్థాయి అధికారులకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో జూనియర్ అసిస్టెంట్ మృతి

- గుడేకల్ చెరువులో మృతదేహం లభ్యం
- ఆత్మహత్యనా..ప్రమాదమా?

ఎమ్మిగనూరు రూరల్: గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ డివిజన్-2 జూనియర్ అసిస్టెంట్ సురేష్‌బాబు మంగళవారం గుడేకల్ చెరువులో శవమై తేలాడు. అనుమానాస్పద స్థితిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన గొల్ల చిన్నహనుమంతు, భాగ్యమ్మకు సురేష్‌బాబు(32), మనోహర్ అనే ఇద్దరు కుమారులు. గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ డివిజన్-2లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసే గొల్ల చిన్నహనుమంతు కరోనా సమయంలో మృతి చెందడంతో కుమారుడు సురేష్‌బాబుకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. విధుల నిమిత్తం ఎమ్మిగనూరులోని టీబీపీ కాలనీలో గది అద్దెకు తీసుకున్న ఈ యువకుడు శుక్రవారం స్వగ్రామానికి వెళ్లాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాల్సి ఉందని ఇంట్లో చెప్పి ఎమ్మిగనూరుకు వచ్చిన సురేష్‌బాబు ఆ తర్వాత తల్లి భాగ్యమ్మ ఫోన్‌కు స్పందించలేదు. అనుమానం వచ్చిన ఆమె ఆఫీస్‌కు ఫోన్ చేయగా డ్యూటీకి రాలేదని చెప్పడంతో వెంటనే ఎమ్మిగనూరుకు వచ్చి ఆచూకీ కోసం గాలిస్తుండగా మంగళవారం ఉదయం ఎల్‌ఎల్‌సీ కాలువ నుంచి గుడేకల్ చెరువులోకి ఓ మృతదేహం కొట్టుకొచ్చిందని తెలిసింది. అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కుమారుడిదై ఉండటంతో బోరున విలపించారు. పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తుండగా ఈ ఘటన జరిగిందని ఆమె తెలిపారు. ఎల్‌ఎల్‌సీలో ప్రమాదవశాత్తు పడ్డాడా..లేక తానే దూకి ఆత్మహత్య చేసుకున్నాడా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



సురేష్‌బాబు (ఫైల్)

జాతీయ రహదారిపై ప్రమాదం



రహదారిపై బోల్తాపడిన కారు



గాయపడిన వ్యక్తి

కల్లూరు: 44వ జాతీయ రహదారిపై ఉలిందకొండ క్రాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో నలుగురు ఆట బొమ్మలు అమ్ముకునే వారు ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలులో వినాయక నిమజ్జనం జరుగుతుండటంతో బెలూన్లు, బొమ్మలు అమ్ముకునేందుకు డోన్ మండలం కొట్లవారిపల్లి గ్రామానికి చెందిన దంపతులు నూర్‌జాబీ, హుస్సేన్ బాషా ఒక బైక్‌పై, తండ్రి కుమారుడైన చిన్న హుస్సేన్, చాంద్ బాషా మరో బైక్‌పై ఊరి నుంచి బయలు దేరారు. ఉలిందకొండ క్రాస్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు రెండు బైక్‌లను ఢీకొట్టింది. తర్వాత వేగం అదుపు కాక పల్టీలు కొడుతూ అవతల రోడ్డులో పడింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలపై ఉన్న నలుగురికి రక్త గాయాలు కాగా కారులో ఉన్న ఓడ్ల నాగేంద్ర ప్రసాద్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నూర్‌జాబీ ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు అనంతపురం జిల్లా పామిడి నుంచి కర్నూలుకు వస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

28న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 28వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్ మైదానంలో జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.20 ప్రవేశ రుసుముతో పాటు జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. 01-04-2007 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 9959051059 నంబరుకు సంప్రదించాలన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: కోటేకల్ గ్రామ సమీపంలోని క్వారీ దగ్గర భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. మంగళవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయ అవరణలో సెబ్ జయరాంనాయుడు విలేకరుల సమావేశం నిర్వహించి పట్టుబడిన మద్యం, నిందితుల వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని కోటేకల్ గ్రామ సమీపంలో క్వారీ దగ్గర కర్ణాటక మద్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. వెంటనే సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, పోలీసులు దాడి చేసి 30 బాక్సుల్లో ఉన్న 2880 (90 ఎంఎల్) ఒరిజనల్ చాయిస్ విస్కీ టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన బి. రంగస్వామి, కోటేకల్‌కు చెందిన జలవాడి సంజీవయ్య, బండారు మహదేవలయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.పట్టుబడిన మద్యం విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం తరలింపుతో పాటు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సెల్: 9440902579 కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.



పట్టుబడిన మద్యం, నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

మారునీళ్ల చెలిమ పార్వతి సేవలో..

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని యాగంటి క్షేత్ర సమీపంలోని మారునీళ్ల చెలిమ వద్ద వెలసిన పార్వతిదేవిని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సుల్తానపుర శ్రీ పంచాక్షరి మహా సంస్థాన తీర్థ బృహన్మఠం పీఠాధిపతి శ్రీ శంభు సోమనాథ్ శివాచార్యులు తన శిష్య బృందంతో మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారునీళ్ల చెలిమలో శివలింగం అత్యంత పురాతనమైందని, ఇక్కడ లింగాకారంలో ఉన్న శివలింగం దేశంలోని 12 ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఎక్కడలేదన్నారు. తన కాశీ పర్యటనలో భాగంగా ముందుగా మారునీళ్ల చెలిమ పార్వతీదేవి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన భక్తులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. కార్యక్రమంలో చెలిమ క్షేత్రం నిర్వాహకులు రామక్రిష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న శ్రీ శంభుసోమనాథ్ శివాచార్యులు